ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

జయశంకర్ 5 భూపాలపల్లి

గురువారం 6 నవంబరు 2025



ఊరూరా.. కార్తీక శోభ



కాళేశ్వరంలో దీపారాధన చేస్తున్న ఫోక్ డ్యాన్సర్ జానులిరి

కార్తీక పౌర్ణమి వేడుకలు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. ప్రజలు ఉదయాన్నే లేచి కల్లాపి చల్లి, స్నానం ఆచరించారు. ఇంట్లో దీపారాధన చేశారు. దేవాలయాలకు వెళ్లి సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఎక్కువ మంది ఉపవాస దీక్షను పాటించారు. పవిత్ర నదుల్లో పుణ్య స్నానాలు చేయడం వల్ల దోషాలు తొలగిపోతాయని ప్రతీతి.

వివరాలు 8వ పేజీలో...



విద్యుత్ కాంతుల్లో కోటగుళ్ల ఆలయం



ములుగులోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కాళేశ్వరం గోదావరి ప్రధాన ఘాట్ వద్ద భక్తుల రద్దీ

వెంకన్న సన్నిధిలో సందడి

- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు





కొండపైకి ఎక్కుతున్న భక్తులు, ఎడ్లబండిపై ఏనుగు వాహనం

రేగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరిలో బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఏనుగు, గుర్రం, మేక వాహనాల్లో ఊరేగింపుగా గుట్ట వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి గీతాలు, కోలాటాలు, నృత్యాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. భక్తులు స్తంభం చెట్టు చుట్టూ వాహనాలతో ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా వన బోజనాలు చేసి ఆనందంగా గడిపారు.

జాతరలో ప్రముఖులు

బుగులోని వెంకటేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జాతరలో పాల్గొన్న వారిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, శాసన మండలి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, నాయకులు ఉమేష్‌గౌడ్, మటిక సంతోష్, పాతుపల్లి సంతోష్, పల్నాటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, నితిన్‌రెడ్డి, శివ,కిరణ్, రవి, శ్రీనివాస్, విజయ్ ఉన్నారు.

సిబ్బందికి భోజన కొరత

బుగులోని వెంకటేశ్వరస్వామి జాతరలో పోలీసు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, విద్యుత్ శాఖ, వైద్య సిబ్బంది మొత్తం 400 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే.. 250 మందికి సరిపడా మాత్రమే భోజనాలు ఏర్పాటు చేయడంతో మిగతా వారికి అన్నం లభ్యం కాలేదు. దీంతో వారు పస్తులతోనే విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. ప్రణాళిక లేకుండా అధికారులు వ్యవహరించడం వల్ల ఈ సమస్య తలెత్తిందని తెలుస్తోంది. ఎంత మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.. ఎంత భోజనం వండాలి? అనే అంచనా లేకుండా నిర్లక్ష్యం చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఏనుగు వాహనంతో వస్తున్న భక్తులు



ఎటూ తేల్చరాయే..

- జీతాలు రావూ రెన్యూవల్స్ కావు..
- నిరీక్షిస్తున్న 24 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టులు
- సంక్షేమ శాఖలో ఉద్యోగుల కొరత
- ఉన్న వారిపైనే అధిక భారం

కృష్ణకాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలోని సంక్షేమ శాఖలో సమస్యలు తిష్ట వేసి ఉంటున్నాయి. ముఖ్యంగా సిబ్బంది కొరత ఇక్కడ వెంటాడుతోంది. ఒక వైపు ఖాళీలు ఉంటుండగా మరో వైపు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెన్యూవల్స్ జరగడం లేదు. జిల్లా సంక్షేమ శాఖ ఆధీనంలో బీఆర్‌టీ, డీసీపీయూ, డీహెచ్‌ఈడబ్ల్యు, సఖి, చైల్డ్ హెల్ప్‌లైన్, 1098, పోషణ్ అభియాన్ విభాగాలు నడుస్తున్నాయి. వీటిలో వివిధ రకాల ఖాళీలు ఏళ్లుగా వేధిస్తున్నాయి. డీడబ్ల్యువోతో పాటు, భూపాలపల్లి ప్రాజెక్టు సీడీపీవో 1, సూపరింటెండెంట్ 1, జూనియర్ అసిస్టెంట్ 1, అటెండర్ పోస్టు 1 ప్రధాన కార్యాలయంలో ఖాళీగా ఉన్నాయి. డీసీపీయూలో 12 పోస్టులకు 6 పోస్టులే యాక్టీవ్‌గా పని చేస్తున్నాయి. ఈ విభాగంలో కీలకమైన డీసీపీవో, పీవోఎస్‌ఐసీ పోస్టును ఒక్కరే నిర్వర్తిస్తున్నారు. అలాగే ఎల్‌సీపీవో 1 , కౌన్సిలర్ 1, సోషల్ వర్కర్ (మహిళ) 1, ఔట్‌రీచ్ వర్కర్ (మహిళ) 1 పోస్టు ఖాళీగా ఉన్నాయి. సీహెచ్‌సీలో కౌన్సెలర్ 1, సూపర్‌వైజర్ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు సఖిలో సైతం సిబ్బంది కొరత ఉంది. మొత్తంగా 13 పోస్టుల్లో ప్రస్తుతానికి ఏడు పోస్టుల్లో మాత్రమే సిబ్బంది ఉన్నారు. ఇంకా ఒక లీగల్ కౌన్సెలర్ 1, ఒక కేస్ వర్కర్ 1, ఏఎన్ఎంలు 2, ఒక ఆఫీసు అసిస్టెంట్ 1, సెక్యూరిటీగార్డు 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న వారిపైనే అధికంగా భారం పడుతోంది. ఖాళీ పోస్టుల భర్తీకి మోక్షం కలగడం లేదు.

నిరీక్షణకు తెరపడేదెన్నడో..


సంక్షేమ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి ఎవరికీ అంతుచిక్కని ప్రశ్నగా మారింది. డీసీపీయూ, డీహెచ్‌ఈడబ్ల్యూ, సఖి, చైల్డ్‌హెల్ప్‌లైన్‌లోని మొత్తం 24 మంది ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వారి జీతాలు, రెనెవల్స్ నిలిపివేశారు. 2024 మే 28న వీరిపై విచారణ జరపాలని అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. అప్పటి నుంచి వీరి సమస్య పెండింగ్‌లోనే ఉంది. 21 నెలలుగా జీతాలు రాకున్నా అష్టకష్టాలకోరుస్తూ క్రమం తప్పకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. విచారణ పూర్తి చేస్తే గానీ వీరి సమస్యకు పరిష్కారం లభించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో 24 మంది చిరుద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కనుక ఇప్పటికైనా జిల్లా పాలనా ధికారి, ఈ ప్రాంత ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించి శాఖను గాడిలో పెట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అడపాదడపా కార్యక్రమాలు

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లలు, మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు ఇతరత్రా వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ శాఖ కింద జిల్లా బాలల పరిరక్షణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖి, చైల్డ్ హెల్ప్‌లైన్, 1098, పోషన అభియాన్ తదితర విభా గాలను ఏర్పాటు చేసింది. అయితే, ఈ శాఖలో నెల కొన్న సమస్యల కారణంగా కార్యక్రమాలు పెద్దగా ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, చట్ట విరుద్ధ దత్తతల నిర్మూలన, అనాథ బాలల చేరదీత, బాల సదనాల నిర్వహణ, స్పాన్సర్‌షిప్ సౌకర్యం, కౌన్సెలింగ్ సేవలు, ఇబ్బందుల్లో ఉన్న బాలల రక్షణ, సంరక్షణ, బాలల సంక్షేమ సమితి ఆదేశాల అమలు, మూడు నెలలకోమారు జిల్లా తనిఖీ కమిటీ చేయాల్సిన బాలసదనాల తనిఖీలు, ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్, ఆపదలో ఉన్న మహిళలకు కౌన్సెలింగ్, షెల్టర్, న్యాయపరమైన సేవలు, ఇతరత్రా కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కుదరని సమన్వయం

సంక్షేమ శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది మధ్య సఖ్యత, సమన్వయం కుదరడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గోప్యంగా ఉంచాల్సిన వివిధ కార్యాకలాపాలు బయటకు పొక్కుతున్నట్లు తెలిసింది. అలా బయటకు వెళ్లిన సమాచారంతో ఇతరులు కలగజేసుకొని శాఖలో నెలకొన్న సమస్యలకు ఫుల్‌స్టాప్ పడకుండా మరిన్నిటిని సృష్టిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగులపై వచ్చిన ఆరోపణల విచారణ ముగుస్తుందనుకునే తరుణంలోనే మళ్లీ ఏదో ఓ చిక్కు వెంటాడుతోందనే ఆందోళన అధికారులు, ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.



నిట్‌లో గేట్ ఉచిత కోచింగ్

- ఈనెల 17 నుంచి తరగతులు ప్రారంభం
- శిక్షణ కాలం ఎనిమిది వారాలు

6వ పేజీలో...



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన



భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొత్కు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి జోసెఫ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన నిధులు రూ.9 వేల కోట్లు ఇంకా పెండింగ్‌లోనే ఉండటం దారుణమన్నారు. స్కాలర్‌షిప్‌లు కూడా ఇంకా విడుదల కాలేదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోవమే కాకుండా సంబంధిత శాఖకు ఇప్పటి వరకు మంత్రిని నియమించకపోవడం విడ్డూరమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రవీణ్, నాయకులు పోతుల పవన్, రమాకాంత్, నవీన్, శ్రీనివాస్, అజయ్, సురేష్, వంశీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల బాలికపై బాలుడి అత్యాచారయత్నం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వివరాలు : 7వ పేజీలో..

సుడిగాలి బీభత్సం

- వందల సంఖ్యలో నేలమట్టమైన చెట్లు
- 30 ఎకరాల్లో మిర్చి, వరి, పత్తి పంటలకు నష్టం
- టవర్ ఎత్తులో ఎగబాకిన గాలి
- మేడారం అడవుల్లో సంభవించిన టోర్నడో తరహాలోనే విపత్తు!

మహదేవపూర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని లెంకలగడ్డ శివారు ప్రాంతంలో సుడిగాలి బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం ఇది జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాయంత్రం 5గంటల ప్రాంతంలో మొబైల్ టవర్ ఎత్తులో భారీ సుడిగాలి సంభవించి గోదావరి వైపు నుంచి మహాముత్తారం వైపు అడువుల్లోకి వెళ్లినట్టు స్థానికులు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టులో ములుగు జిల్లా మేడారం అడవుల్లో వచ్చిన టోర్నడో తరహాలో విపత్తు చోటుచేసుకుందని చర్చించుకుంటున్నారు. సుడిగాలి సంభవించినప్పుడు లెంకలగడ్డ వద్ద సుమారు 10మంది కూలీలు పనిచేస్తున్నారు. ఒక్కసారిగా సుడిగాలి కుదిపేయడంతో ఏం జరుగుతోందోనని వారు ఆయోమయానికి గురయ్యారు.





సుడిగాలి దాటికి బండ్లవాగు సమీపంలో నేలకొరిగిన చెట్లు, ధ్వంసమైన మిరప చేను

నేలమట్టమైన చెట్లు, వాలిపోయిన పంటలు

లెంకలగడ్డ శివారు గోదావరి నది ప్రాంతంలో ప్రారంభమైన సుడిగాలి బండలవాగు వెంబడి పత్తి, మిర్చి, వరి పంటల మీదుగా మహాముత్తారం వైపు వీచినట్లు స్థానికులు చెబుతున్నారు. పంట పొలాల్లోకి వచ్చిన సుడిగాలి అక్కడే పనిచేస్తున్న కూలీలను సైతం కుదిపేయగా వారు పలుమార్లు కిందపడిపోయినట్టు తెలిసింది. బండలవాగు నుంచి మహాముత్తారం వైపు టోర్నడో తరహాలో విపత్తు జరగ్గా వందల సంఖ్యలో చెట్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. లెంకలగడ్డకు చెందిన బండారి భాస్కర్, బండారి శ్రీను, బండారి మధుసూదన్‌కు చెందిన మిర్చితో పాటు సలీం, ఆకుల సారయ్య, శంకరయ్య, శేఖర్‌కు చెందిన పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి.



సుడిగాలి దాటికి ధ్వంసమైన పత్తి చేను

గ్రామస్థుల్లో భయాందోళన

సుడిగాలి బీభత్సంతో పంట నష్టంతోపాటు వందల ఎకరాల్లో చెట్లు నేలవాలగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కూలీలంతా ఇంటికి వెళ్లే సమయంలో ఈ విపత్తు సంభవించగా చేలల్లో ఉన్న సుమారు 10మంది మాత్రమే సుడిగాలి తాకిడికి ఇబ్బంది పడ్డారు. కానీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఇదే సుడిగాలి గ్రామం మీదుగా వస్తే ప్రాణనష్టంతో పాటు భారీగా ఆస్తినష్టం సంభవించేదని గ్రామస్థులు చెబుతున్నారు. సుడిగాలి దాటికి అడవిలో చెట్లు.. వాటి కొమ్మలు విరిగి పైభాగంలో చిక్కుకున్నట్లు చెప్పారు. కొన్ని చెట్లు మాత్రం వేర్లు సహా కుప్పకూలాయి. ఈ విషయమైన పలిమెల రేంజ్ అధికారిని సంప్రదించగా పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఆటవీలో ఎంత మేర నష్టం వాటిల్లింది.. ఇంకా ఎంత మొత్తంలో చెట్లు దెబ్బతిన్నాయో తెలియాల్సి ఉంది. దీనిపై అధికారులెవరూ స్పందించలేదు. సుడిగాలి బీభత్సానికి శాస్త్రీయ కారణాలు ఏమిటనేది ఇప్పుడే చెప్పలేమని అన్నారు.

పంచాయతీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

కార్యదర్శే కారణమంటూ లేఖ

గోవిందరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న చిలక వెంకన్న బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. తాను ఆత్మహత్యకు ప్రయత్నించడానికి పంచాయతీ కార్యదర్శి కారణమని ఆయన రాసిన ఓ లేఖ వెలుగులోకి వచ్చింది. తనను పంచాయతీ కార్యదర్శి రూ.30 వేలు అడిగాడని, ఇవ్వకపోవడంతో తోటి సిబ్బంది ముందు తిడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నాడు. ఈవిషయం తెలుసుకున్న పస్రా పోలీసులు ఎంజీఎంకు వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.



చికిత్స పొందుతున్న వెంకన్న

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం మండల కార్యదర్శి మల్లారెడ్డి

పంచాయతీ కార్యదర్శి వేధింపులు తాళలేక గ్రామపంచాయతీ కార్మికుడు చిలక వెంకన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఇందుకు బాధ్యుడైన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజులుగా తనను పంచాయతీ కార్యదర్శి వేధింపులకు గురిచేస్తున్నట్లు వెంకన్న లేఖ రాసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

9న రెడ్డిగుడిలో కల్యాణం

గణపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాకతీయుల కళాక్షేత్రమైన రెడ్డిగుడిలో ఈ నెల 9న నాగలింగేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. కార్తీక మాసంలో భాగంగా ప్రతి ఏటా ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ లగ్నపత్రికను కల్యాణదాతలు మోటపోతుల రవీందర్-సరిత దంపతులకు అందజేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

ములుగు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువులను ములుగు పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని జంగాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద 44 ఆవులు, ఎద్దులు తీసుకెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. పశువులను రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. పశువులను గోశాలకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

» పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

» రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

పాలకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వల్మిడి, ముత్తారం గ్రామాల మధ్య రూ.3 కోట్ల సీఆర్‌ఆర్ నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రైతులను దృష్టిలో ఉంచుకొని కొత్త రోడ్లకు నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. వల్మిడి, ముత్తారం గ్రామాల మధ్యనున్న పురాతన బ్రిడ్జి ఇటీవల మొంథా తుఫాన్‌తో కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు. ఒక్క తుఫాన్ తాకిడికి 30 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయిందని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నూతన బ్రిడ్జి నిర్మాణాకిఇ సీఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.3 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు,



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు

తండాలు, గూడాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. సీసీరోడ్లు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణానికి కూడా కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ లావుడ్యా భాస్కర్, మాజీ ఎంపీటీసీ బొమ్మగాని మానస, భాస్కర్, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, భూమ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు

» స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న » చిలుపూర్ వెంకన్న ఆలయంలో సమీక్ష

చిలుపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ భూముల పరిరక్షణకు పటిష్ఠమైన చర్యలు చేపడతామని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్.వెంకన్న స్పష్టం చేశారు. బుధవారం స్థానిక చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆర్డీవో ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ విజయ్ కుమార్‌తో ఆలయ భూముల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకన్న మాట్లాడుతూ.. ఆలయ భూముల అన్యాక్రాంతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఆక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల లక్ష్మీనరసింహస్వామి, నష్కల్ సీతారామచంద్రస్వామి, చిలుపూర్ బుగులు వెంకన్న, వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో ఉన్న భూములపై సమగ్ర సర్వే చేపట్టి హద్దులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్ఐలు అర్జున్, లోకేశ్, మండల సర్వేయర్ శ్రీనివాస్ నాయక్, కుర్రెంల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సమీక్షిస్తున్న ఆర్డీవో వెంకన్న

మద్యం మత్తులో ఆత్మహత్య

వెంకటాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన పర్శిక రాజు(38) రెండేళ్ల నుంచి మద్యానికి బానిసై ఏ పనిచేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. నిత్యం మద్యం సేవిస్తూ భార్యతో డబ్బులు కావాలని గొడవ పడుతుండేవాడు.

ఈక్రమంలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజు భార్యను డబ్బులు అడగగా ఇవ్వలేదు. దీంతో మత్తులో ఉన్న రాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు రేకులకు ఉన్న ఇనుప గొట్టానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

అడవి పంది దాడిలో రైతు మృతి

ములుగు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడవి పంది దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు మండలంలోని దేవగిరిపట్నంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుందూరు వెంకటేశ్వరరెడ్డి (66) రోజులాగే ఉదయం పంట పొలానికి వెళ్లి పంటను పరిశీలిస్తుండగా హఠాత్తుగా అడవి పందులు దాడి చేయడంతో ఘటనా స్థలంలోనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

శివాలయంలో జ్యోతిర్లింగార్చన



ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మంగపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) నాలుగు వందల ఏళ్ల చరిత్ర కలిగిన ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. కమలాపురం, కోమటిపల్లి, బోరునర్సాపురం, కొత్తపేట గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు హర నామస్మరణతో మార్మోగాయి. అర్చకుడు విస్సవజ్జుల నరేశ్ శర్మ, ఆలయ చైర్మన్ కోలగట్ల నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం ఏడు గంటలకు జ్వాలా తోరణం, వేయి దీపాలతో జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

రైతులను పట్టించుకోని ఎమ్మెల్యే

బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి



పాలకుర్తిలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పాలకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల నియోజకవర్గంలో పంటలు నష్టపోయి ఆందోళన చెందుతున్న రైతులను ఓదార్చకుండా స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటలు నష్టపోయి తిండి గింజలు కూడా దక్కడం లేదని, రైతుల పరిస్థితి జీవన మరణ సమస్యగా మారిందన్నారు. సీఎం ఎకరానికి రూ.10వేలు పరిహారం ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపిస్తే రైతుల పక్షాన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహకారంతో పీఎం నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి జాతీయ విపత్తుగా ప్రకటింపచేసి రైతులకు పరిహారం అందచేసే విధంగా కృషి చేస్తామన్నారు. పాలకుర్తి రైతులు తుఫాన్‌తో వందలాది ఎకరాల పంటలు నష్టపోయి రోదిస్తుంటే ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం చేస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వ్యవహార శైలి సినిమా ఎపిసోడ్‌లా తలపిస్తుందని విమర్శించారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు పూర్తి కాకపోవడంతో నీరంతా వృథాగా పోతుందని, వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. పోతన సమాధి వద్ద జరిగే అభివృద్ధి పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్, జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, పల్లె కుమార్, దారావత్ శ్రీనివాస్, లకావత్ రవి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

జనగామ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు భిక్షాటన చేసి అంబేద్కర్ విగ్రహం ఎదుట పుస్తకాలను చేతిలో పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రరీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఇప్పటికైనా స్పందించి వాటిని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్, కార్యదర్శి దాసగాని సుమ, నాయకులు మామిడాల రమేశ్, యాకన్న, ఆర్య, స్నేహ, మానస, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేడు పీహెచ్‌డీ అడ్మిషన్లకు రీ ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేయూ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం అభ్యర్థులకు నవంబరు 6న గురువారం రీఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ ఉదయం 10 గంటల నుంచి జరిగే రీ ఇంటర్వ్యూలు హాజరుకావాలని సమాచారం అందించారు. అన్ని ఒరిజినల్స్ ధృవపత్రాలతో పాటు 3 సెట్ల జిరాక్స్ పత్రులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా, 2022 పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో అన్ని విభాగాల్లో సీట్లు పెంచి ఆశావహులైన అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించగా, తెలుగు విభాగంలో కొద్దిమందికే అవకాశం కల్పించారని అభ్యర్థులు వాపోతున్నారు. కొందరు అభ్యర్థులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రాన్ని అందించారు. ఇదిలా ఉండగా, గతంలో తెలుగు విభాగంలో కేటగిరి-1లో రెండు సీట్లకు జరిగిన పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన విషయం విదితమే. అవకతవకల దృష్ట్యా తెలుగులో పీహెచ్‌డీ అడ్మిషన్లకు రీ షెడ్యూల్ ప్రకటించి అభ్యర్థులందరికీ రీఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఓపెన్ టూ ఆల్ బాలబాలికల విభాగంలో రెండురోజులు పాటు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు నగదు పురస్కారంతో పాటు, ప్రశంసాపత్రాలు, వ్యక్తిగత మెడల్స్ ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా ప్రకటనలో కోరారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి నోటిఫికేషన్

హనుమకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకులను (గెస్ట్ ఫ్యాకల్టీ) తాత్కాలిక విధానం ద్వారా భర్తీ చేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యుడు ఎం.డి. అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను ఎంపిక చేసే సమయానికి 65 ఏళ్ల వయసులోపు ఉన్న రిటైర్డ్ / నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో కళలు-కళావిద్య ఒక పోస్టుకు విద్యార్హతలు ఫైన్ ఆర్ట్స్/మ్యూజిక్/డాన్స్/థియేటర్ మొదలైన వాటిలో మాస్టర్స్ (ఎంఎఫ్ఏ) బ్యాచిలర్స్ (బీఎఫ్ఏ) డిగ్రీ కలిగి ఉండాలి. గౌరవ వేతనం రూ.15600. ఉర్దూ మీడియలో ఫిలాసఫీ/సోషియాలజీ/ సైకాలజీ ఒక పోస్టుకు విద్యార్హతలు సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ), ఎంఈడీ కలిగి ఉండాలి. గౌరవ వేతనం రూ.23400. ఉర్దూ మీడియంలో పెడగాజీ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఒక పోస్టు. విద్యార్హతలు గణితం సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ), ఎంఈడీ కలిగి ఉండాలి. గౌరవ వేతనం రూ.23400. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలి. 14న తుది జాబితా ప్రకటించి మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో 15న డెమో/ ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు.

బీఈడీ కళాశాలలో..

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని బీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీలకు చెందిన 3 పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు-కళా విద్య, ఫిలాసఫీ, పెడగాజీ ఆఫ్ మ్యాథమెటిక్స్‌లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈడీ పూర్తి చేసి 65 ఏళ్లలోపు అర్హత, ఆసక్తి గల వారు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్ల మరమ్మతుకు సత్వర చర్యలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు



దెబ్బతిన్న రోడ్డును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న రాంబాబు

రఘునాథపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు సకాలంలో మరమ్మతులు చేపట్టడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు అన్నారు. మండలంలో దెబ్బతిన్న మాదారం-రఘునాథపల్లి, బాంజీపేట-శ్రీమన్నారాయణపురం, కంచనపల్లి-రఘునాథపల్లి రోడ్లను రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి బుధవారం సందర్శించి పరిశీలించారు. రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన నిధులను అంచనా వేయాలని అధికారులకు సూచించారు. యుద్ధప్రాతిపదికన దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకరావడానికి చర్యలు తీసుకుంటామని రాంబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఆర్‌అండ్‌బీ డీఈ అశోక్‌కుమార్, ఏఈ రుతిక్, గొట్టం భాస్కర్‌రెడ్డి, సంపత్, శ్రీనివాస్, రాంరెడ్డి, అశోక్, ముకుందరెడ్డి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గేట్ ఎంట్రెన్స్‌కు ఉచిత కోచింగ్

» నిట్‌లో 17 నుంచి తరగతులు ప్రారంభం

» శిక్షణ కాలం ఎనిమిది వారాలు



హనుమకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లోని ఎస్సీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గేట్ ఉచిత కోచింగ్ తరగతులను నిర్వహించనున్నారు. ఈ కోచింగ్ కార్యక్రమం వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులతో పాటు వరంగల్ పరిసర ప్రాంతాల్లోని ఇతర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటుంది. ఈ తరగతులను అన్ని ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి నిర్వహిస్తారు. కోర్సు 8వారాల పాటు కొనసాగుతుంది. ఈనెల 17 నుంచి 2026 జనవరి 9వ తేదీ వరకు ఈ ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులు గేట్ పరీక్షకు సమర్థవంతంగా సిద్ధంకావడంలో సహాయపడడమే లక్ష్యంగా ఈ తరగతుల నిర్వహణ ఉంటుంది. అసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు ఫారం నింపి దాఖలు చేయడం ద్వారా తరగతులకు హాజరు కావచ్చు. దరఖాస్తు ఫారమ్, నియమాలు, నిబంధనలు, ఇతర మరిన్ని వివరాల కోసం ఎన్ఐటీ వరంగల్ అధికారిక నోటిఫికేషన్ విభాగంలో చూడవచ్చు. మరింత సమాచారానికి విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ సెల్, ఎన్ఐటీ, వరంగల్‌ను సంప్రదించవచ్చునని నిట్ అధికారులు తెలిపారు.

నియమ నిబంధనలు

ఉచిత కోచింగ్ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు గుర్తింపు కార్డు ఇస్తారు. కళాశాలలోకి రావడానికి, తరగతులకు హాజరుకావడానికి ఈ కార్డును తప్పనిసరిగా కలిగి ఉండాలి. కళాశాల నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలి. తరగతులు నవంబరు 17 నుంచి ప్రారంభమవుతాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తారు. క్రమం తప్పకుండా క్యాంపస్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వారం వారం పరీక్షా ఫలితాలను బట్టి టాపర్లను నిర్ణయిస్తారు. తరగతులకు తప్పకుండా హాజరుకావడం తప్పనిసరి. వరుసగా నాలుగు తరగతులకు హాజరు కాకపోతే ప్రవేశాన్ని తొలగిస్తారు. ఇతర కాలేజీ విద్యార్థులు ఎవరైనా క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటారు. తరగతుల్లో మొబైల్ వాడకం నిషేధం. ఇతర వివరాలకు నిట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆఫీసు 9963169781లో సంప్రదించవచ్చు. ఈ ఉచిత కోచింగ్‌కు అన్ని శాఖల బీటెక్ తృతీయ, బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు అర్హులు.

బ్రిడ్జిలు నిర్మించకపోతే ఆందోళన చేస్తాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్

జనగామ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చీటకోడూర్, గానుగుపహాడ్ బ్రిడ్జిలను నిర్మించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని చీటకోడూర్ బ్రిడ్జి కూలిపోవడంతో బుధవారం బీజేపీ నాయకులు పరిశీలించి నూతన బ్రిడ్జిని నిర్మించాలని వాగుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బ్రిడ్జిల నిర్మాణం కోసం నిరసన వ్యక్తం చేసిన నాయకులను అరెస్టు చేసి జనగామ జైలుకు తరలించడంతో ములాఖత్ ద్వారా అరెస్టు అయిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సౌడ రమేశ్ మాట్లాడుతూ గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడంతో, చీటకోడూర్ లోలెవల్ కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. బ్రిడ్జిల నిర్మాణం కోసం నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే వారిని విడుదల చేయాలని, బ్రిడ్జిల నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో శివరాజ్ యాదవ్, మార్క ఉపేందర్, రాంకోటి, శానబోయిన మహిపాల్ ముదిరాజ్, దడిగె రవి, ఈర్ల నవీన్, బండారు తిరుపతి, ముక్క స్వామి తదితరులు పాల్గొన్నారు.



చీటకోడూర్ వాగు వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పెనుగోలులో వైద్య శిబిరం

వాజేడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో గుట్టలపై ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పెనుగోలు గ్రామంలో బుధవారం వాజేడు పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు వైద్యశిబిరం నిర్వహించారు. మంగళవారం వైద్యుడు, సిబ్బంది వాగులు, వంకలు, గుట్టలు దాటుకుంటూ సుమారు 17 కి.మీ. నడిచి వెళ్లి గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. పెనుగోలులో పది కుటుంబాలు నివాసం ఉంటుండగా 38 మంది జనాభా ఉంది. వారిలో 25 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా ఇద్దరికి మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు హెచ్‌ఏ పేర్కొన్నారు. వారికి అవసరమైనమందులను అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఇంటింటికీ దోమల మందు పిచికారీ చేయించినట్లు పేర్కొన్నారు. ఫీవర్ సర్వే నిర్వహించి జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తపూతలు సేకరించి మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం 17 కిలోమీటర్లు కాలినడకన తిరిగి మండల కేంద్రంలోని వైద్యశాలకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. పెనుగోలుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో వైద్యసిబ్బంది ఏడాదిపాటు పలుమార్లు కాలినడకన వెళ్లి అక్కడ నివాసం ఉంటున్న గిరిజనులకు వైద్యసేవలు అందిస్తున్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హెచ్ఏ వెంకటేశ్వర్లు



వేయిస్తంభాల ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా దర్శనానికి బారులు తీరిన భక్తులు

వెల్లివిరిసిన కార్తీక శోభ

నగరంలోని ఆలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలు



వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఖిలా వరంగల్ స్వయంభూ శంభు లింగేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం

- ఇంటింటా ఉసిరి దీపాలు వెలిగించిన మహిళలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిండు వెన్నెల వెలుగుల్లో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 4 గంటలకు బ్రహ్మీ ముహూర్తంలో నీళ్లలో ఉసిరికాయలు వేసుకొని స్నానాలు ఆచరించారు. సుప్రభాత సమయంలో ఆలయాలను దర్శించుకున్నారు. గణపతి పూజ అనంతరం శివుడికి అభిషేకాలు నిర్వహించారు. విష్ణుమూర్తి ఆలయాల్లో అలంకరణలు, అమ్మవారి దేవాలయాల్లో కుంకుమ పూజలు చేశారు. సామూహికంగా రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఇళ్లల్లో దేవతామూర్తుల వద్ద ఉసిరి కొమ్మను పెట్టుకొని పూజలు చేశారు. ఉసిరి కాయలపై దీపాలు వెలిగించి హారతులు పట్టారు. కార్తీక మాసంలో ఇప్పటివరకు నోము కోని వారు ఈ రోజు నోముకున్నారు.

దేవాలయాల్లో అభిషేకాలు, అలంకరణలు, హోమాలు, కుంకుమ పూజల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఇళ్ల వద్ద కార్తీక దీపాలు వెలిగించి ప్రసాదాలను వితరణ చేశారు. నగరంలోని అన్ని శివాలయాల్లో, విష్ణు ఆలయాల్లో, అమ్మవారి దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి పర్వదినం వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. కొన్ని చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని అనేక ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. ముఖ్యంగా ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయానికి తెల్లవారుజామునుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భారీ క్యూలైన్లలో నిలబడి పరమేశ్వరుడిని దర్శించుకొని తరించారు. నాగుల చవితి రోజు పాములకు పాలు పోయని మహిళలు, కార్తీక పౌర్ణమి వేళ పుట్టల వద్దకు తరలివచ్చి నాగేంద్రుడిని కొలుస్తూ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలోని పుట్టల వద్దకు పెద్దసంఖ్యలో మహిళలు చేరుకొని నాగేంద్రుడికి మొక్కుబడుగు చెల్లించుకొని, పరమేశ్వరుడిని దర్శించుకొని పరవశించిపోయారు.

దేవాలయాల్లో పూజలు..

హనుమకొండ బ్రాహ్మణవాడలోని నాగుల గల్లీ, పంచరామ ఆలయ సమీపంలోనూ, పబ్లిక్ గార్డెన్ వద్ద, ఏకశిల పార్కు సమీపంలోని సీతారామచంద్రస్వామి ఆలయం, రెవెన్యూ రామాలయం, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వరాలయంలో మహిళలు నాగేంద్రుడిని కొలిచారు. హనుమకొండ షిరిడీ సాయిబాబా ఆలయం, దత్తక్షేత్రం, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలను పెద్ద ఎత్తున జరుపుకున్నారు. బ్రాహ్మణవాడలోని శ్రీ గోదా రంగనాథస్వామి ఆలయంలో పవిత్ర కార్తీకపౌర్ణమి వేళ గోదా రంగనాయకులకు ఆలయ అర్చకులు నరసింహాచారి, రాఘవాచారిల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు జరిగాయి.

పద్మాక్షి, సిద్ధేశ్వర ఆలయాల్లో మహన్యాసక రుద్రాభిషేకాలు జరిగాయి. ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో పౌర్ణమి దత్తాత్రేయ హోమం నిర్వహించగా అమ్మవారి దేవాలయంలో చండీహోమాన్ని ఆచరించారు. రాజరాజేశ్వరీ అమ్మవారి దేవాలయంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. శృంగేరి శంకరమఠంలో శారద మాతకు, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ములుగురోడ్‌లోని శ్రీవాసవీ మాత దేవాలయంలో, హనుమాన్ జంక్షన్‌లోని శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయాల్లో సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.



ఖిలా వరంగల్ స్వయంభూ శంభులింగేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భక్తులు



వరంగల్ కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వర దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల పూజలు



గర్భాలయంలో భక్తుల పూజలు

కాళేశ్వరానికి కార్తీక శోభ

- 60వేల మంది భక్తుల దర్శనాలు.. కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- దీపారాధనలు, లక్షవత్తుల కాంతుల వెలుగులు

మహదేవపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు బుధవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం 4గంటల నుంచే బారులు తీరారు. బస్టాండు, కాళేశ్వర ముక్తీశ్వరాలయం, సరస్వతీ ఘాట్, ప్రధాన్‌ఘాట్‌ల వద్ద భక్తులతో కాళేశ్వరం రద్దీగా మారింది. సుమారు 60వేల మంది భక్తులుతరలిరాగా టికెట్లు, ప్రసాదాల ద్వారా ఒక్క రోజే ఆలయానికి రూ. 9.50లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొన్నా రు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు.. భక్తులకు ఉచిత ప్రసాదాన్ని(సిరా) అందించారు. గోదావరిలో నది స్నానంతో పాటు ఆలయంలో అభిషేకాలు.. బ్రాహ్మణులకు దీపదానాలు, లక్షవత్తుల పూజలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.

ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు క్రింద దీపాలు వెలిగించేందుకు భక్తులు క్యూకట్టారు. స్వామివార్ల దర్శనార్థం వచ్చిన భక్తులకు దాతలు అన్నదానాలతోపాటు పాలు, పండ్లు, తాగునీటిని పంపిణీ చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో మహిళలు విశిష్ట పూజలతో పాటు కుంకుమార్చన నిర్వహించుకున్నారు. సా యంత్రం ఆలయ ఆవరణలో జ్వాతా తోరణం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా, కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా బస్సులు సరిపడా అందుబాటులేక ఇబ్బందులు పడ్డారు. వచ్చి న ఒక్కో బస్సులో 70మందికిపైగా తరలివెళ్లిపోయారు. గంటల తరబడి వేచి చూసినా బస్సులు రాకపోడంతో ఆర్టీసీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



గోదావరి నదిలో దీపాలు వదులుతున్న మహిళా భక్తులు

వైభవంగా బుగులోని బ్రహ్మోత్సవాలు

భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఏనుగు వాహనంతో వస్తున్న భక్తులు

రేగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరిలో బుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన ఏనుగు, గుర్రం, మేక వాహనాల్లో ఊరేగింపుగా గుట్ట వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి గీతాలు, కోలాటాలు, నృత్యాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. భక్తులు స్తంభం చెట్టు చుట్టూ వాహనాలతో ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా వన బోజనాలు చేసి ఆనందంగా గడిపారు. బుగులోని వెంకటేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జాతరలో పాల్గొన్న వారిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, శాసన మండలి పక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, నాయకులు ఉమేష్‌గౌడ్, మటిక సంతోష్, పాతుపల్లి సంతోష్, పల్నాటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, నితిన్‌రెడ్డి, శివ, కిరణ్, రవి, శ్రీనివాస్, విజయ్ ఉన్నారు.

దీపారాధనతో కాంతులు విరజిమ్మిన క్షేత్రం

వెంకటాపూర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి):కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున ఆలయానికి చేరుకున్న భక్తులు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని రుద్రాభిషేకాలు చేశారు. మహిళలు దీపారాధన చేసి తన భక్తిని చాటుకున్నారు.దేవాలయంలో దీపాలు వెలిగించకపోవడంతో ఆలయం పక్కన ఉన్న మామిడిచెట్టు కింద శివలింగం వద్ద భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో కొంతమేర భక్తులకు ఇబ్బంది కలిగింది. అనంతరం భక్తులు అర్చకులకు దీపదానం చేశారు. తదుపరి రామలింగేశ్వర స్వామికి ఇష్ట వాహనమైన నందీశ్వరుడి వద్ద భక్తులు మొక్కులు చెల్లించి ఆలయ గార్డెన్‌లో సరదాగా గడిపారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకున్న భక్తులు బోటులో విహరిస్తూ ఆనందంగా గడిపారు. కార్తీకమాసం సందర్భంగా దీపం వెలిగిస్తే సర్వ పాపాలు హరిస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు కోమళ్లపల్లి హరీశ్ శర్మ, మోహనమఠం ఉమాశంకర్ తెలిపారు.



రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

కన్నులపండువగా కందగిరి జాతర

వెల్లువలా తరలివచ్చిన భక్తజనం

కురవి, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ పర్వతంపై లక్ష్మీనర్సింహాస్వామి జాతర బుధవారం ఘనంగా జరిగింది. వేలాదిమంది భక్తులు కందికొండను అధిరోహించి, నర్సింహాస్వామి, లక్ష్మీదేవిల కల్యాణానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గుట్టపై పుష్కరిణి (కోనేటి)లో స్నానం చేసి లక్ష్మీనర్సింహాని ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ సతీమణి ప్రమీల కందికొండ గుట్టమెట్ల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పూజలు నిర్వహించారు. ఇక లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. అనంతరం తీర్థ ప్రసాదాలను పంచి భక్తుల దర్శనార్థం స్వామివారిని ఉంచారు. సాయంత్రం గుట్టపై ఉన్న ఆలయం పైభాగంలో అఖండజ్యోతిని వెలిగించారు.



కందగిరి పర్వతంపైకి ఎక్కుతున్న భక్తులు

నాలుగేళ్ల బాలికపై బాలుడి అత్యాచారయత్నం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

తొర్రూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై ఓ బాలుడు(15) అత్యాచార యత్నానికి పాల్పడగా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో బుధవారం వెలుగు చూసింది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరులోని ఓ కాలనీలో ఉండే బాలిక(4)పై అదే కాలనీకి చెందిన బాలుడు అత్యాచారానికి యత్నించాడు.

ఈ విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు... స్వయంగా బాలుడి తల్లిదండ్రులకు తెలిపేందుకు వెళ్లారు. అయితే వారు బాలిక కుటుంబసభ్యులపై దాడికి దిగారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాలుడిపై పోక్సో నమోదు చేశారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం

భక్తులతో కిక్కిరిసిన వేయిస్తంభాల ఆలయం

హనుమకొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక పౌర్ణమి వేళ చారిత్రక సహస్ర స్తంభాల ఆలయం శోభాయమాన విద్యుత్ దీప కాంతులతో అద్భుత శోభతో వెలుగొందింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మేయర్ గుండు సుధారాణి, ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకులు గట్టు మహేశ్‌బాబుతో కలిసి లక్ష దీపోత్సవాన్ని ప్రారంభింపజేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కిక్కిరిసిన క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి రుద్రేశ్వరున్ని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి వేళ తెల్లవారు జామున 4 గంటలకు మంగళ వాయిద్యసేవ, సుప్రభాతం, ఉత్తిష్ట గణపతికి హరిద్రా కుంకుమ విలేపనంతో స్వామి వారికి సేవలు ఆరంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 108 పుట్ట తేనెతో వేయి మంది భక్తులచే నమక చమకాలతో సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. దేవాదాయశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివారిని రాత్రి 10 గంటల వరకు సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకోవడం విశేషం. ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రుడి పుట్టల వద్ద ఉసిరిక, తులసీదళాలతో, మారేడు వృక్షాల కింద మహిళలు పెద్దఎత్తున దీపాలు వెలిగించుకున్నారు. నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్ర పర్వంగా దీపోత్సవం

రాత్రి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళల సమక్షంలో మేయర్ సుధారాణి దీపోత్సవాన్ని ప్రారంభించారు.ఆర్యవైశ్య మహాసభ నాయకుడు గట్టు మహేశ్‌బాబు కొమ్మ పూజ నిర్వహించి దీపోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. కాగా, రంగవల్లులతో శివపార్వతుల చిత్రాలు, ఓంకారం, స్వస్తిక్, స్వాగతం లాంటి ముగ్గులతో వేసిన రంగవల్లులతో మహిళలు దీపాలు వెలిగించి ఆలయ ప్రాంగణాన్ని దీపకాంతులతో శోభాయమానం చేశారు. హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, సీఎంఆర్ జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి, ప్రముఖ ఇంజనీర్ రమేశ్, శ్రీనివాస్ గుప్తా, చిదుల అంజనీదేవి, మునుగోటి రమేశ్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో అనిల్ కుమార్ వేడుకలను పర్యవేక్షించారు. రాత్రి 10 గంటల వరకు వేయిస్తంభాల ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యాచారిణి తాడూరి రేణుక శిష్యబృందం 25 మంది కళాకారులు నేత్రపర్వంగా సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.



వేయిస్తంభాల ఆలయ ఆవరణలో లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



దీపోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి



వేయిస్తంభాల ఆలయ ఆవరణలో యువతులు

దేవాలయాల్లో కార్తీక శోభ




వెంకటాపురం, కన్నాయిగూడెంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ములుగు/మంగపేట/వెంకటాపురం/ములుగు టౌన్/కన్నాయిగూడెం/ఏటూరునాగారం/వాజేడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పవిత్రమైన గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను గోదావరి నదిలోకి వదిలారు. జిల్లా కేంద్రంలోని శివాలయంలోని నాగదేవత విగ్రహం ఎదుట పుట్టలో పాలు పోసి పూలు, పండ్లు, నైవేద్యాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా భక్తులు శివాల యం ఆవరణలో హోమ వత్తులు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఏటూరునాగారంలోని శ్రీ ఉమా రామాలింగేశ్వర స్వామి దేవాలయానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేశారు. వాజేడు, తాడ్వాయి తదితర మండలాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగపేట మండలం లక్ష్మీ నర్సాపురం గ్రామంలోని నాగులమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండల ప్రజలు సమీపంలోని గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. నాగులమ్మ ఆలయ పరిసర ప్రాంతంలోని గిరిజన గ్రామాల తోపాటు రాజుపేట, రమణక్కపేట గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగులమ్మ పుట్టకు పాలు పోసి పూలు ఫలాలతో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. నవ నాగులకు కంకవనం పుట్టకు భక్తితో పూజలు చేసి శ్రీ నాగలింగేశ్వర స్వామిని దర్శించుకుని దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన పూజారులు బాడిశ రామకృష్ణ స్వామి, జి. నాగ రమేష్ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. వెంకటాపురం మండలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మహిళలు తెల్లవారుజామున గోదావరినదిలో స్నానమా చరించి గోదావరి ఒడ్డున తులసి గద్దెలను ఏర్పాటుచేసి గౌరమ్మ పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమలను గోదావరిలో వేసి అరటిదొప్పలపై దీపాలను వెలిగించి వదిలిపెట్టారు. అనంతరం మండల కేంద్రంలోని శివాలయంలో ఉసిరిచెట్టు కింద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం, గుర్రేవుల, ఏటూరు తదితర గ్రామాల ప్రజలు కార్తీక పౌర్ణమి పురష్కరించుకుని గోదావరి స్నానాలు ఆచరించారు. ఇంటికి చేరుకుని గోదావరి జలాలు చల్లుకుని పూజలు నిర్వహించారు. పలు చోట్లా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

కోటగుళ్లలో భక్తుల సందడి

ఉసిరి, మామిడి చెట్ల వద్ద దీపాలు

గణపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకతీయుల కట్టడాలైన కోటగుళ్లు, రెడ్డిగుడిలలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. అర్చకులు నాగరాజు, గంగాధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 21 వేల దీపాలను వెలిగించారు. అలయ ఆవరణలోని ఉసిరి, మేడి, జమ్మి చెట్ల వద్ద మహిళలు పెద్ద ఎత్తున దీపాలను వెలిగించారు.

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా...

భూపాలపల్లిటౌన్/కాటారం/మల్హర్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలు భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలు ఉదయాన్నే లేచి కల్లాపి చల్లి, స్నానం ఆచరించారు. ఇంట్లో దీపారాధన చేశారు. అలాగే దేవాలయాలకు వెళ్లి సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ పండుగ రోజున ఎక్కువ మంది ఉపవాస దీక్షలు పాటించ డం ఆనవాయితీ. పైగా పవిత్ర నదులలో పుణ్య స్నానాలు చేయడం వల్ల వారి దోషాలు తొలగిపోతాయని ప్రతీతి. ఈ క్రమంలోనే భూపా లపల్లి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎక్కువ మంది కాళేశ్వరం లోని గోదావరి నదికి వెళ్లి పుణ్యస్నానాలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణం నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాళేశ్వరం వెళ్లడంతో బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ అధికారులు అదనంగా బస్సులు కూడా వేశారు. భూపాలపల్లి పట్టణంలోని భక్తాంజనే యస్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయం, సీతారామాంజనేయ స్వామి దేవాలయం, సహస్రలింగేశ్వర స్వామి, యప్ప దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పలువురు సతీసమేతంగా పాల్గొని సత్యనారాయణ వ్రతాలు చేశారు. మంజూర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి దంపతులు పాల్గొని సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. మల్హర్ మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకల సందర్భంగా ఉదయం నుంచే తాడిచర్లలోని వెంకటేశ్వర ఆలయం, పెద్దమ్మతల్లి, శివపంచాయతన అభయాంజ నేయ స్వామి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఊసిరి చెట్టు కింద వత్తులు వెలిగించుకున్నారు. అలాగే అర్చకులకు దీప దానాలు ఇచ్చుకున్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆలయ అర్చకులు ప్రహ్లాద్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాటారంమండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. కొంతమంది ప్రజలు నదీ స్నానం చేయగా మరికొందరు తెల్లవారుజామునే ఇళ్ల వద్ద ఉసిరి కాయలు వేసుకుని స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. వందలాది మంది భక్తులు కాళేశ్వరం వెళ్లి త్రివేణిసంగమ గోదా వరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర-ముక్తీశ్వర స్వామి ఆల యంలో దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు. ధన్వాడ దత్తాత్రేయ స్వా మి, బొప్పారం సీతారామచంద్రస్వామి, గారెపల్లి, కాటారం, గంగా రం, రేగులగూడెం గ్రామాల ఆంజనేయస్వామి ఆలయాల్లో జ్వాలా తోరణం, సహస్ర దీపాలంకరణ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి శివ, కేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైనది కావడంతో భక్తులు తులసి, ఉసిరి చెట్ల కింద వత్తులతో దీపా లు ముట్టించారు. వివిధ రకాల దీప దానాలు చేశారు. రాత్రి ఇళ్ల వద్ద దీపాలను వెలిగించి, విద్యుత్ దీపాలంకరణలతో ఇళ్లను అలంకరించారు.



వెంకటేశ్వరస్వామి దేవాలయంలో
మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జ్యోతి దంపతులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవి చందర్

ములుగు టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ములుగు పట్టణ పరిధి బండారుపల్లిలో పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులకు సహకరించాలన్నారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు దళారుల చేతిలో మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలోత్ దేవ్‌సింగ్, మాజీ సర్పంచ్ కక్కెర్ల అశోక్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నెల్లుట్ల రాజన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మంగపేట (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ మద్దతు ధర లభించే కొనుగోలు కేంద్రాలను రైతుఉల సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ తోట రమేష్, హేమాచల లక్ష్మీనృసింహ స్వామి రైతుమిత్ర ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి అన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బిక్షంపేట, బోరునర్సాపురం, మల్లూరు, నరసింహ సాగర్, వాడగూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రమేష్ ప్రారంభించారు. కమలాపురంలో హేమాచల లక్ష్మీనృసింహ స్వామి రైతుమిత్ర మర్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సెంటర్ నిర్వాహకుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం సీఈవో అల్లి గౌరమ్మ, డైరెక్టర్లు నర్ర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఐక్య వేదిక నూతన కార్యవర్గం

మంగపేట నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీసీ ఐక్య వేదిక కమలాపురం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు కోడెల నరేష్ తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గంగుల శ్రీను, ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా కాసర్ల సాంబయ్య, రాచకొండ శ్రీను, ఎనగందుల లక్ష్మణ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గార బాలకృష్ణ, కోశాధికారిగా మండల రవీందర్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు

ములుగులో డిజిటల్ లైబ్రరీ



ములుగులో ఏర్పాటైన డిజిల్ లైబ్బరరీ

ములుగు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో తెలంగాణ సొసైటీ ఆఫ్ డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహకారంతో ఎస్‌ఓటీఈఎస్ డిజిటల్ లైబ్రరీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చాపర్తి రాజు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు, విద్యార్థినీ విద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్ రిసోర్సస్ ఈ-బుక్స్ ద్వారా, వీడియోస్ ద్వారా కంప్యూటర్‌పై శిక్షణ అందించడం ఈ లైబ్రరీ ముఖ్యోద్దేశమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందించడమే లక్ష్యమన్నారు. ఈ డిజిటల్ లైబ్రరీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి జోనల్ క్రీడా పోటీలు

డీసీవో వెంకటేశ్వర్లు వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో వెంకటేశ్వర్లు

ములుగు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకారం గ్రామంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయని డీసీవో ఎ. వెంకటేశ్వర్లు తెలిపారు. జాకారం గురుకులంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఇవి జరుగుతాయని, 935 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొంటారని తెలిపారు. వారికి భోజనం, వసతితో పాటు మెడికల్ క్యాంపును అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో భూపాలపల్లి డీసీవో గోల్కొండ భిక్షపతి, క్రీడల ఇన్‌చార్జి, పీడీ వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు ఆర్. వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, ప్రభాకర్, శ్రీను, సుధాకర్, ఉపాధ్యాయులు యాదగిరి, రామచంద్రం, బ్రహ్మాచారి, రజనీ, మమత, సదయ్య, దయానంద్, ముఖేష్, పీఈటీలు చంద్రమౌళి, పుల్లయ్య పాల్గొన్నారు.

రేగులగూడెం యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులతో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలో యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంధం రజనీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కొర్ల రాజబాపు, ఉపాధ్యక్షుడిగా మంథెన సాయి, కోశాధికారిగా నంది సదయ్య, కార్యదర్శిగా బోడ రామ్మూర్తి, అధికార ప్రతినిధిగా రవిసాగర్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా కంబాల వంశీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, మాజీ సర్పంచులు నవీన్‌రావు, నంది శంకరయ్య, ఏఎంసీ డైరెక్టర్ పిల్లమారి రమేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్, యూత్ నాయకులు కామిడి వెంకట్‌రెడ్డి, నారాయణ, ముత్తయ్య, రాజ్‌కుమార్, బాలరాజు, నరేష్, రమణారెడ్డి, సారయ్య, శశికుమార్, మహేష్, దేవేందర్‌రెడ్డి, అనిరుధ్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల చేయూత

భూపాలపల్లిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా పనిచేసి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ తీవ్ర అనారోగ్యానికి గురైన నీలం శంకర్‌కు ఆయన వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం సాయం అందించారు. చిట్యాల మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన శంకర్ 25ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా పాఠాలు బోధిస్తూ జీవనం సాగిస్తున్నారు. చాలీచాలని చాలిచాలని వేతనాలతో బతుకీడ్వలేక చివరకు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు విషయం తెలుసుకున్న అయన వద్ద చదువుకున్న విద్యార్థులు (ప్రస్తుత ప్రభుత్వ ఉపాధ్యాయులు) తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌పల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తైనేని కిష్టయ్య కుటుంబాన్ని మాజీ ఎంపీటీసీ తోట జనార్ధన్ బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మానెం రాజబాపు, తోట బాపు, తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

టేకుమట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా తాగునీరు అందక సోమన్‌పల్లి ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు. తాగునీరు లేకపోవడంతో బోరునీళ్లు తాగి గ్రామస్థులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పది రోజులుగా ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాగా విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మంచినీటి మోటారు చలివాగులో నీటమునిగి పాడైపోయిందని, గ్రామ పంచాయితీలో నిధులు లేక రిపేరుకు ఆలస్యమవుతోందని తెలిపారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

గణపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా పరిధి భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కాకతీయ లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఓపెన్‌కాస్టులో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు అధికారులు బుధవారం కేఎల్‌పీ కార్యాలయంలోకౌన్సెలింగ్ నిర్వహించారు. గైర్హాజరు కార్మికులకు ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు, గని మేనేజర్ సునీల్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ సాయికృష్ణ మార్గ నిర్దేశం చేశారు. ఇకపై ప్రతిఒక్కరూ అండర్‌గ్రౌండ్‌లో 150 కంటే ఎక్కువ మస్టర్లు, 200మస్టర్ల కంటే ఎక్కువ ఉపరితల మస్టర్లు చేయాలని సూచించారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ సంఘాల నాయకులు శంకర్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మిరప చేన్లలో నీరు నిల్వకుండా చూడాలి

- ఉద్యాన శాఖ జిల్లా అధికారి సునీల్ కుమార్

మల్హర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : వర్షాల వల్ల మిరప చేన్లలో నిలిచిన నిల్వ నీటిని బయటకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని తాడిచర్లలో శివారులోని మిరప తోటలను ఆయన బుధవారం పరిశీలించారు. పంటను రక్షించుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అధిక తేమ కారణంగా పంటకు వేరు కుళ్లు వ్యాధి వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు తోటలో నీరు తగ్గిన వెంటనే వేర్ల చుట్టూ మందులను పిచికారీ చేసి తెగులును నియంత్రించొచ్చని అన్నారు. నీరు తగ్గిన తర్వాత మొక్కలు పుంజుకునేందుకు అవసరమైన మందులను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దీంతో ఆకులు తిరిగి పచ్చగా మారుతాయన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారి

ప్రకృతి వైపరీత్యాలకు కుదేలవుతున్న రైతన్నలు



దెబ్బతిన్న వరి పంట వద్ద రైతులు

మల్హర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రైతులకు ఈ ఏడాది వెతలే మిగిలాయి. వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు కురవక ఇబ్బందులు పడగా ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 16 వేల ఎకరాల్లో వరి, 4,600 ఎకరాల్లో పత్తి, వెయ్యి ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల వరి, పత్తి పంటలు తెగుళ్ల బారినపడ్డాయి. దీంతో సగానికి పైగా రైతులు పంటల పై ఆశలు వదులుకున్నారు. ఉన్న కాస్త పంటలు మొన్నటి తుఫాన్‌కు దెబ్బతిన్నాయి. మానేరు పరీవాహక ప్రాంతంలో మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 400 ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేయగా ఇది మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొన్నటి తుఫాన్ రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. చేతి కచ్చిన వరి పంట పూర్తిగా నేలవాలి వరి ధాన్యం కళ్లంలో రాలడంతో మొలకలు వస్తున్నాయి. పంటను కోయించినా లాభం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పెట్టుబడులు కూడా వెళ్లే పరిస్థితి లేదని దిగులు చెందుతున్నారు. పత్తి కూడా వర్షానికి తడిసి రంగు మారుతోందని అంటున్నారు. మిర్చి పంట కూడా వర్షాల వల్ల తెగుళ్ల సోకే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సీసీఐ కేంద్రంలో మందకొడిగా పత్తి కొనుగోళ్లు

కాటారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో సరైన దిగుబడులు రాక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న తమకు సీసీఐ నిబంధనలు పులి మీద పుట్రలా తయారయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి వారం రోజుల్లో 504 క్వింటాళ్ల పత్తి కొనుగోలు జరిగింది. సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం 8-12 ఉంటేనే కొనుగోలు జరుగుతుంది. ఒకటి రెండు శాతం అధికంగా ఉన్నా కొనుగోలు చేయడానికి అధికారులు విముఖత చూపుతున్నారు. చలికాలం మంచు కురుస్తుండటంతో పత్తి ఏరే క్రమంలో తేమశాతం అధికంగా ఉంటోంది. దీంతో రైతులు విధి లేక బహిరంగ మార్కెట్లో దళారులు, మిల్లర్లకు తక్కువ ధరలకే పత్తిని విక్రయిస్తున్నారు. అంతేకాకుండా ఈ ఏడాది పత్తిని అమ్ముకోవాలంటే కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని నిబంధనలు పెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గత ఏడాదిలా 12 క్వింటాళ్లు కాకుండా పత్తి విక్రయాల పరిమితి ఎకరాకు 7 క్వింటాళ్లే చేయడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే అయినకాడికి అమ్ముకుంటున్నారు. సీసీఐ ద్వారా 500 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు జరగ్గా మండల వ్యాప్తంగా ప్రైవేట్ వ్యాపారులు సుమారు 4 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయడం గమనార్హం. వడ్లలో ఉన్నట్లు తేమ శాతం 17 వరకైనా సీసీఐ అనుమతించాలని, కేంద్రానికి వచ్చిన వారి నుంచి ఆధార్ కార్డు ద్వారా గతంలో లాగా పత్తిని కొనాలని రైతులు కోరుతున్నారు.



సీసీఐ కొనుగోలు చేసిన పత్తి